క్లుప్తంగా

ఎంపీ స్థానానికి మద్ది దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ తరుపున టికెట్ కోసం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాసరెడ్డి శనివారం గాంధీభవన్‌లో పార్టీ నాయకులు పులివెందుల ప్రతాప్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మద్ది మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్టానం యువతకు పెద్ద పీట వేస్తున్న తరుణంలో తాను టికెట్ ఆశిస్తున్నానన్నారు.

రాయల..



దరఖాస్తు అందజేస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం పార్లమెంట్ సీటును నాకు ఇవ్వాలని కోరుతూ పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరంలోని టౌన్–2 పరిధిలో 11 కేవీ బస్ స్టాండ్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సబ్‌స్టేషన్ ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిళ్లగూడెం సాయిబాబా టెంపుల్, బస్ డిపో వెనుక ప్రాంతం, బస్ డిపో రోడ్డు, లెనిన్ నగర్, మీ సేవా సెంటర్ ఏరియా, భక్త రామదాసు కళాక్షేత్రం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేలకొండపల్లి: మండలంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏఈ కె.రామారావు తెలిపారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం 33/11కెవి విద్యుత్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు వీవీపాలెం, జీఆర్ఆర్ శ్రీనివాస్ కాలనీ, నూతన కలెక్టరేట్, వేపకుంట్ల, చింతగుర్తి పరిధిలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎస్సీ వర్గీకరణే జీవితాశయం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణే మాదిగల జీవిత ఆశయమని ఎమ్మార్పీఎస్‌టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ కమిటీ వేసి వర్గీకరణ చేస్తానని ఇచ్చిన మాట తప్పారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ముస్లింలకు ఎంపీ, ఎమ్మెల్సీలతో పాటు ఉన్నత పదవులు కులాల దమాషా ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సి.ప్రసాద్, ఎం.సైదులు, శ్రీను బాలస్వామి, ఆనందరావు, సుధాకర్, ధనమ్మ పాల్గొన్నారు.

హోంగార్డు ఔదార్యం

ఖమ్మం క్రైం: ఓ వృద్ధురాలు పోగొట్టుకున్న పర్సును దానిలో ఉన్న విలువైన డాక్యుమెంట్లు అందజేసి ట్రాఫిక్ హోంగార్డు రవి తన ఔదార్యం చాటుకున్నాడు. శనివారం ఖమ్మంలో ఓ వృద్ధురాలు మొగిలి హైమావతి పోగొట్టుకున్న పర్సుతో పాటు విలువైన డాక్యుమెంట్లు ఆమె కుమారుడు ప్రసాద్‌కు అప్పగించాడు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది హోంగార్డు రవి నిజాయితీని అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరుకారం
వినోద	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	నా సామిరంగ
ఆదిత్య	బూట్‌కట్ బాలరాజు
శ్రీనివాస	కిస్మత్
సుందర్	హను–మాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఆలస్యం ఎందుకు..?





సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ సురభి

- సమస్యలు, అభివృద్ధి పనులపై సభ్యుల ఆరా
- కేఎంసీ కౌన్సిల్‌లో పలు అంశాలపై సమీక్ష
- అజెండాలోని అంశాలకు ఆమోదం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఏ డివిజన్‌లో చూసినా కుక్కల సమస్యలు ఎక్కువగా ఉందని, తాగునీటి పంపు కొత్త కనెక్షన్లు కావాలని ప్రజలు అడుగుతున్నారని, సీఎం వాగ్దాన నిధులతో పనులు ప్రతిపాదించి ఎందుకు పూర్తి చేయడం లేదని కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశ వేదికగా అధికారులను ప్రశ్నించారు. అంతేకాక పలు పనులు ఆలస్యమవుతుండడంపై ఆరా తీస్తూ వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని విన్నవించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మేయర్ అధ్యక్షతన, కమిషనర్ ఆదర్శ్ సురభి సమక్షంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని కొని ప్రాంతాలను పారిశ్రామిక, కమర్షియల్ ప్రాంతం నుండి రెసిడెన్షియల్ ప్రాంతంగా మార్పు కోసం ప్రభుత్వ అనుమతి, శానిటేషన్ కమ్ మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల పెంపు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పారితోషికం చెల్లింపు, రిటైర్డ్ తహసీల్దార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, హార్టికల్చర్ ఉద్యోగుల సేవలు పొడిగింపు, కమిషనర్ క్యాంపు కార్యాలయం అద్దె చెల్లింపు, డీఆర్ఎఫ్ సిబ్బంది కాల పరిమితి పొడిగింపు, వాణిజ్య ప్రాంతాలలో దుకాణాల నుండి చెత్త, భారీ ఘన వ్యర్థాల సేకరణ టెండర్ల ఆమోదం తదితర అజెండాలోని అంశాలపై చర్చించి ఆమోదించారు.

రూ.22 కోట్ల విలువైన పనులు పూర్తి

సమావేశంలో కార్పొరేటర్లు లేవనెత్తిన సమస్యలపై కమిషనర్ ఆదర్శ్ సురభి సమాధానాలు చెప్పారు. కుక్కలకు స్టెరిలైజ్ చేసి, యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసి తిరిగి బంధించిన ప్రాంతంలోనే వదిలేయాలనే నిబంధనలు ఉందని తెలిపారు. 2021లో 1,830 కుక్కలు, 2022లో 1,115 కుక్కలకు స్టెరిలైజ్ చేయగా, 2023లో 2,600 కుక్కలకు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆ సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. ఎస్‌డీఎఫ్ క్రింద ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేయగా రూ.22 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా ప్రారంభం కాని పనుల విషయమై ప్రభుత్వ అనుమతి తీసుకుని చర్యలు చేపడుతామన్నారు. 2014 సంవత్సరంలో వినియోగం ప్రకారం అమృత్ ద్వారా తాగునీటి సరఫరా పనులు చేపట్టామని, ఇప్పుడు అమృత్ పథకం ద్వారా రూ.200 కోట్లు వస్తాయని తెలిపారు. విలీన గ్రామాల్లో పైప్‌లైన్లు లేనిచోట, గ్యాప్స్ ఉన్న చోట పనులు పూర్తిచేయనున్నట్లు సూచించారు. ఇక 18 ఈఎల్ఎస్ఆర్‌లకు గాను బాలపేట మినహా అన్నిచోట్లా పనులు పూర్తయినట్లు తెలిపారు. ప్రతిరోజూ తాగునీటి సరఫరా కోసం అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. ఔట్ సోర్సింగ్ వర్కర్ల గురించి కౌన్సిల్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కూల్చివేతలపై ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో 25 చోట్ల రూ.45 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని, ఫెన్సింగ్, సీసీ కెమెరాలతో రక్షణ చర్యలు చేపట్టామన్నారు. పీఓటీ అతిక్రమణలు ఉన్నవారికి ఇంటి నంబర్ల విషయమై చర్యలు చేపడతామని వెల్లడించారు. అనంతరం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నగరంలో కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీరు ప్రతిరోజూ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేటర్లు తెలిపిన సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, కేఎంసీలోని వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల విక్రయాల్లో తేడాలుంటే చర్యలు



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

నేలకొండపల్లి: ఎరువుల దుకాణాలలో విక్రయాలలో అవకతవకలు, తేడాలు ఉంటే చర్యలు తప్పవని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర హెచ్చరించారు. శనివారం మండలంలోని బోదులబండ, రామచంద్రాపురం, చెన్నారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల గోడౌన్‌లను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టాక్ రికార్డుల ప్రకారం ఉందా లేదా అని స్వయంగా ఏడీఏ పరిశీలించారు. అనంతరం నేలకొండపల్లి, కోరట్లగూడెం గ్రామాలలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులను ఈ పాస్ ద్వారా విక్రయాలు జరపాలని, వెంటనే రైతులకు రశీదులు అందించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పని చేయకుంటే కాల్వలు తీయిస్తా..



కార్మికుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: పారిశుద్ధ్య సిబ్బంది పని చేయకుంటే డివిజన్లలోని జవాన్లదే బాధ్యత అని, బాధ్యతగా విధులు నిర్వర్తించని జవాన్లను తిరిగి కాల్వల్లో మట్టి తీసే పనుల్లోకి పంపిస్తామని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శనివారం తెల్లవారుజామున నగరంలోని 22, 23, 24, 26, 37 డివిజన్లలో పర్యటించి పనులను పరిశీలించారు. కార్మికుల హాజరు నమోదు, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పరిశీలించారు. జవాన్లకు, కార్మికులకు యూనిఫామ్ లేకపోవడం, కనీస రక్షణ పరికరాలు వినియోగించకపోవడంతపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాం, రక్షణ పరికరాలు లేకుండా పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాక్టర్లకు, ఆటోలకు తప్పనిసరిగా మైకులు ఏర్పాటు చేయాలని, డివిజన్లలో రోడ్ల వెంట చెత్త ఉంటే సహించేది లేదన్నారు. దుకాణాల ఎదుట వ్యర్థాలు వేస్తే వారికి అపరాధరుసుము విధించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లోకి సొసైటీ డైరెక్టర్లు



డైరెక్టర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్లు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ సమక్షంలో ముగ్గురు డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరగా వారికి దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, కోడాలి గోవిందరావు, మాజీ సొసైటీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి, కనమర్లపూడి రాము, తేజావత్ కోటేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేయాలి



మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో కంకణాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో రామయ్య మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అసంఘటితరంగంలో కార్మికులను యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని, స్కీం వర్కర్లకు చట్టపరమైన కనీస వేతనం చెల్లించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.శ్రీనివాస్, పెరబోయిన వెంకన్న, బొమ్మకంటి రమేష్, ప్రభాకర్, గడల నారాయణ, కిన్నెర నారాయణ, ఎస్.శ్రీను, రామక్రిష్ణ పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ రమేష్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఖమ్మం మామిళ్లగూడెం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన త్రీటౌన్ సీఐ రమేష్‌ను బాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ... బాలు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ హెచ్.వీరబాబు, ట్రస్టీ సభ్యురాలు కుక్కల ప్రవళిక, పంది వేణు, కె.సైదులు, పడిశాల వీరస్వామి, కె.కాశయ్య, గట్టికొండ చుక్కయ్య, సీతారాములు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అలవెన్స్‌పై ఆమోదంపై హర్షం

కామేపల్లి: తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయులకు దసరా, సంకాంత్రి, వేసవి సెలవులలో కన్వీనియన్స్ అలవెన్స్‌లను కట్ చేయకుండా ప్రతీ నెలా ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినందుకు దివ్యాంగుల ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సపావట్ కిషన్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం టేకులతండాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. దివ్యాంగుల ఉద్యోగులకు అండగా నిలిచిన దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రవి, హనుమ, మోహన్, భాస్కర్, దేవా పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్



మెడిటేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం హార్ట్‌ఫుల్ మెడిటేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి మాట్లాడుతూ... వర్క్‌షాప్‌లో అనేక రకాల ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను ప్రముఖ మెడిటేషన్ ట్రైనర్ కరుణాకర్ వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే.శ్రీలక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో మార్చురీలో ఉన్న గుర్తుతెలియని యువకుడి మృతదేహానికి అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల మధిర జీఆర్‌పీ ఔట్‌పోస్టు పరిధిలో యువకుడి మృతదేహం రైలుపట్టాలపై పడి ఉండగా మార్చురీకి తరలించారు. మృతదేహం తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవటంతో రైల్వే పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: గుర్తు తెలియని కారు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం కొత్తలింగాల స్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూసుమంచి మండలం జీళ్లచెరువు గ్రామానికి చెందిన గోపీ శ్రీను కొత్తలింగాల గ్రామం నుంచి బైక్‌పై వస్తుండగా కొత్తలింగాల పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో శ్రీనుకు కాలుకి తీవ్ర గాయమవ్వగా ఆస్పత్రికి తరలించారు.

నర్సయ్య సేవలు స్ఫూర్తిదాయకం

నేలకొండపల్లి: సీపీఎం నాయకులు తిగుళ్ల నర్సయ్య సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కోనాయిగూడెంలో నర్సయ్య సంస్మరణ సభ సందర్భంగా ఆయన స్థూపం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బండి రమేష్, ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, కె.వీ.రెడ్డి, బెల్లం లక్ష్మి, పగిడికత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, లక్కం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కామేపల్లి : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటుకు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. 31 అక్టోబర్ 2020 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తయిన వారు ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తులు అందించాలని, ముఖ్యంగా సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారితో అటెస్ట్ తప్పనిసరిగా చేయించి అందించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ పట్టభద్రుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలకవర్గాలకు వీడ్కోలు



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

రఘునాథపాలెం: మండలంలో ఏకగ్రీవంగా ఎన్నికయిన హర్యాతండ పంచాయితీ పాలకమండలి పదవీ కాలం ముగియడంతో శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జెడ్పీటీసీ మాలోతు ప్రియాంక పాల్గొని పాలక మండలి సభ్యులను సర్పంచ్ మాలోతు కాంతి, ఉప సర్పంచ్ మాలోతు దేశ్య నాయక్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తారాదేవి ,అంగోత్ బాబు, ఆజ్మీరా శ్రీను, భూక్యా చందు, గుగులోత్ ఈర్య, భూక్యా రాజా, ఆజ్మీరా వెంకయ్య, బానోత్ మంగి, భూక్యా ప్రసాద్, ఉపేంద్రమ్మ, రాంబాబు, మాలోత్ పద్మ, చందులల్, భద్రు, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

బాల సాహిత్యం పోటీల్లో 34 మంది విజేతలు

ఖమ్మంగాంధీచౌక్: బాల సాహిత్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షల పోటీల్లో 34 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, బోగోజు ఉపేందర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు సమీక్షలు పంపించగా 34 మందిని ఎంపిక చేశామన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు.

ఎంపీ పరామర్శ..

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం పలు కుటుంబాలను పరామర్శించారు. నగరంలోని కృషిభవన్ రోడ్‌లో ఇటీవల మరణించిన కనపర్తి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మానుకోండ రాధాకిషోర్, చల్లగుండ్ల రాజేష్, కేతినేని హరీష్, మోతుక్కారి శ్రీను, చావా ప్రతాప్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

ఖమ్మంరూరల్: గ్రామ పంచాయతీ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు మండల సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ శనివారం ఎంపీఓ రాజారావుకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడుతూ... పంచాయతీ వర్కర్లకు పనిభారం పెంచారు కానీ కనీస వేతనాలు ఇవ్వటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. పంచాయతీ కార్మికుల తొలగింపు నిలుపుదల చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఏ.శ్రీనివాసరావు, నాగరాజు,వి. ధర్మేందర్, సైదులు, పద్మ, వేగినాటి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దంపతులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ ఆలయ నిర్మాణానికి నగరంలోని బురాన్‌పురానికి చెందిన జక్కుల స్వాతి వెంకటరమణ దంపతులు శనివారం రూ.5వేలు విరాళం అందజేశారు.

నేడు పుస్తకావిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు తాను రచించిన 'చెమట పూల తోట' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పుస్తక రచయిత, కవి, గాయకుడు రౌతు రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవులు, రచయితలు పాల్గొంటారని, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్య సేవలను పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: విద్యా, వైద్యం రంగాలను పూర్తిగా ప్రభుత్వ పరం చేయాలని, ప్రధానంగా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల సంఖ్య పెంచి, వైద్య సేవలను పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. వైద్యులు పుల్లారెడ్డి, బుగ్గవీటి గౌతమ్, భారవి, రంజిత్, అనుదీప్, సుబ్బారావు, జెట్ల రంగారావులు రోగులను పరీక్షించగా.. నాయకులు శ్రీనివాసరావు, సుదర్శన్, సుబ్బారావు, పి.ఝాన్సీ, అఫ్జల్, వీరభద్రం, రమేష్, అరుణ, కల్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు శుభలేఖ అందజేసిన పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ దంపతులను శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా తన సోదరుడి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహ ఆహ్వానపత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి సతీమణి మాధురి, సోదరుడు ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

గొలుసు చోరీకి యత్నం

నేలకొండపల్లి: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును దొంగిలించేందుకు ఇరువురు దుండగులు ప్రయత్నించిన ఘటన మండలంలోని గువ్వలగూడెంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లినేని విజయమ్మ అదే గ్రామానికి చెందిన తన కూతురు ఇంటికి వెళ్లి వస్తుండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో గొలుసును దొంగిలించేందుకు ప్రయత్నం చేశారు. తేరుకున్న మహిళ గట్టిగా కేకలు వేయడంతో దుండగులు అక్కడ నుంచి పారిపోయారు.

నైతిక విలువలు పెంపొందించాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు బోధించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలని సీఐ అంజలి అన్నారు. శనివారం నగరంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్లో సాహితి జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. చైర్మన్ నాగేశ్వరరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, డైరెక్టర్లు తిరుపతయ్య, కొండె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యుల దినోత్సవం



డాక్టర్లను సన్మానిస్తున్న సిబ్బంది

కామేపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ భావనశ్రీలను వైద్య సిబ్బంది శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. హెచ్‌ఈఓ దూప్‌సింగ్, హెల్త్ సూపర్‌వైజర్ ఎమ్.రాజు, ఏఎన్ఎం ఉషారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న పరిశీలన

కామేపల్లి : మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. శనివారం మండలంలోని ఊట్కూర్ గ్రామంలో రైతులు యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెగుళ్లు, చీడపీడల నుంచి పంటల సంరక్షణపై ప్రత్యేక అవగాహన కల్పించి పలు సలహాలు, సూచనలు చేశారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు.

రోడ్డు మరమ్మతులు అడ్డగింపు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేపట్టిన బీటీ రోడ్డు

కామేపల్లి: జాస్తిపల్లి నుంచి కొత్తలింగాల వరకు రెన్యూవల్ బీటీ రోడ్డు కంకర తేలిన ప్రదేశాల్లో శనివారం మరమ్మతులు చేపట్టారు. విషయం తెలుసుకున్న జాస్తిపల్లి గ్రామస్తులు రోడ్డు మరమ్మతులను అడ్డుకున్నారు. జాస్తిపల్లి–కొత్తలింగాల కోటమైసమ్మతల్లి దేవాలయం వరకు ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం ఎంఆర్ఆర్ రూ.1.15 కోట్ల నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణంపై గత నెల 26న సాక్షి దినపత్రికలో 'పదిరోజులకే రహదారుణం' అంటూ ప్రచురితమైన కథనం పాఠకులకు విధితమే. ఈ మేరకు గ్రామస్తులు రోడ్డు మరమ్మతుల పనులను అడ్డుకున్నారు. దీంతో రోడ్డు మరమ్మతుల పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. ఇకనైనా రోడ్డును పునర్నిర్మించాలని లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.